సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 19 । జనవరి । 2025



సోమశిలలో 69.707 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 69.707 టీఎంసీలు ఉన్నాయి. డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 650, కండలేరుకు 200, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.81,900
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,435
3 శాతం జీఎస్టీతో	రూ.7,658
నవర (8 గ్రా)	రూ.61,264

గరిష్ఠం/కనిష్ఠం
29.9 /22.0

వాతావరణం

ఆదివారం జిల్లాలో వాతావరణం మేఘావృతమై ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 75 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఎన్టీఆర్ వర్ధంతికి ప్రముఖుల డుమ్మా

ఆత్మకూరు: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని ఆత్మకూరు పట్టణంలో ఆయన అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, పలువురు కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. ఆనం రామనారాయణరెడ్డి పట్టణంలోని కొందరికే ప్రాధాన్యం ఇస్తున్నారని.. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ వారికే పనులు జరుగుతున్నాయని, దీనిపై కినుకు వహించిన కౌన్సిలర్లు, కొందరు ముఖ్య నాయకులు ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారని సమాచారం. పార్టీ అధికారంలో లేనప్పుడు సైతం భారీ స్థాయిలో అన్నదానాలు చేసిన వారందరు ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని అభిమానులు ప్రశ్నిస్తున్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు రూరల్: యువతకు ఏపీపీఎస్‌డీసీ పీఎం ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ద్వారా ప్రముఖ కంపెనీలు, పరిశ్రమల్లో అవకాశాలను కల్పిస్తున్నారని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఖయ్యూంతో కలిసి పథెం ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. 10వ తరగతి, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ కోర్సులు చదివి 21 నుంచి 24 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు.


మాలకొండలో హుండీ కానుకలు లెక్కింపు



ఆలయ ఈఓకు చెక్కు అందజేస్తున్న దాత మాల్యాద్రిరెడ్డి

వలేటివారిపాళెం: జిల్లాలో ప్రసిద్ధ మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ కానుకలు శనివారం లెక్కించారు. రూ.11.75 లక్షల రాబడి వచ్చినట్లు ఆలయ ఈఓ సాగర్‌బాబు తెలిపారు. కుంకుమార్చన ద్వారా రూ.22 వేలు, తలనీలాలు రూ.54 వేలు, ప్రత్యేక దర్శనం రూ.4.69 లక్షలు, లడ్డూ ప్రసాదాలు రూ.1.65 లక్షలు, అన్నదానం కోసం రూ.3.85 లక్షలు, గదుల అద్దెల ద్వారా రూ.32 వేలు వచ్చినట్లు వివరించారు. నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం రాచవారిపల్లికి చెందిన బడే మాల్యాద్రిరెడ్డి స్వామి వారి అన్న ప్రసాదానికి రూ.4 లక్షలు విరాళంగా చెల్లించినట్లు ఆలయ ఈఓ పేర్కొన్నారు. లెక్కింపు ఆలయ అధికారుల పర్యవేక్షణలో జరిగింది.

ఊపందుకున్న నిమ్మ ధరలు



నిమ్మకాయలు

సైదాపురం: నిమ్మ ధరలు ఊపందుకున్నాయి. ఇటీవల చలి ప్రభావంతో నిమ్మ ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు నిస్సహాయ స్థితిలో పడిపోయారు. అయితే మూడు రోజుల నుంచి నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఒకింత ఆనందంలో మునిగిపోయారు. గూడూరు మార్కెట్లో కిలో నిమ్మకాయలు రూ.25 నుంచి రూ.35 వరకు పలుకుతున్నాయి. నాణ్యత కలిగిన కాయల ధర రూ.45 దాకా పలుకుతున్నట్టు రైతులు చెబుతున్నారు. శనివారం గూడూరు నిమ్మ మార్కెట్లో లూజు (50 కేజీ బస్తా) రూ.2,400 నుంచి రూ.3,300 వరకు కొనుగోలు చేస్తున్నారు. నిమ్మ ధరలు మరింత పెరగనున్నట్టు సమాచారం.

ఉమ్మాయపల్లిలో అనుమానితులకు దేహశుద్ధి

మర్రిపాడు: మండలంలోని పెగళ్లపాడు పంచాయతీ ఉమ్మాయపల్లి గ్రామంలో శనివారం రాత్రి అనుమానాస్పదంగా సంచరిస్తున్న 8 మంది వ్యక్తులను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పట్టుకుని తనిఖీ చేశారు. వారి వద్ద కోళ్లు, పసుపు, కుంకుమ, చలగపారలు, గడ్డపారలు కనిపించాయి. దీంతో వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వారు క్షుద్రపూజల కోసం లేదా గుప్త నిధుల తవ్వకాల కోసం వచ్చి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

దుర్గం పోతు ధర అదుర్స్



మేకపోతు

సండే స్పెషల్

ఉదయగిరి మేకపోతులకు మార్కెట్లో భలే గిరాకీ ఉంటోంది. ప్రధానంగా ఇక్కడి దుర్గం పరిసరాల్లోని ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, ఆకులను మేకపోతులు ఆహారంగా తీసుకోవడం వల్ల వీటి మాంసం రుచికరంగా ఉండడమే కాకుండా ఔషధాలతో నిండి ఉంటుందని పశు వైద్యులు కూడా నిర్ధారిస్తున్నారు. వీటి మాంసంలో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయని, అందుకే వ్యాపారులు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తుంటారు.

ఔషధ మొక్కలే మేకల మేత

- అందుకే ఇక్కడి పోతు ధర రూ.18 వేల నుంచి రూ.20 వేలు
- అయినా కొంటున్న మాంసం ప్రియులు
- బయట ప్రాంతాల జీవాల ధర రూ.12 వేలే

ఉదయగిరి: ఉదయగిరి దుర్గంపైన, పరిసరాల్లో వేల సంఖ్యలో అనేక రకాల ఔషధ గుణాల మొక్కలు ఉన్నాయి. మేకలు, మేకపోతులు నిత్యం దుర్గంపై ఆయా రకాల మొక్కలను ఆహారంగా తీసుకుంటాయి. మేకపోతు పుట్టిన నాటి నుంచి కోతకు వచ్చే వరకు (5 నెలలు) నిత్యం ఉదయగిరి కొండల్లో తిరుగుతూ వివిధ రకాల ఔషధ ఆకులు, మొక్కలు తినడం ద్వారా వాటి మాంసంలో కూడా ఔషధ పోషకాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఇక్కడి మేకపోతుల మాంసం రుచి చాలా బాగుంటుంది. ఎక్కువ మంది వ్యాపారులు, మాంసం ప్రియులు ఉదయగిరి దుర్గంలో మేపే పోతులను అధిక ధర పెట్టి కొనేందుకు కూడా వెనుకాడడం లేదు.

ఆర్గానిక్ మాంసంగా భావిస్తారు..

దుర్గంపై ఉన్న ఔషధ గుణాలు కలిగిన మొక్కలను తినడం వల్ల మేకపోతులకు వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుంది. అందువల్ల ఇవి జబ్బున పడిన సందర్భాలు చాలా తక్కువ. పశు వైద్యశాలలో వాడే మందులు వాడకపోవడం, కృత్రిక ప్రొటీన్‌ను ఆహారంగా కూడా ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో ఔషధ గుణాలు కలిగిన మొక్కలను తినడం వల్ల ఆర్గానిక్ మాంసంగా భావిస్తారు.

10 కేజీల పోతు ధర రూ.18 వేల పైమాటే

ఒకప్పుడు ఉదయగిరిలోని హోటళ్లలో దుర్గం మేకపోతు మాంసం అని ప్రత్యేకంగా బోర్డులు పెట్టేవారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు కచ్చితంగా వాటి మాంసం రుచి చూసేవారు. అయితే ప్రస్తుతం ఈ మేకపోతులకు డిమాండ్ ఎక్కువగా ఉన్నందున స్థానిక హోటళ్లలో నిత్యం ఈ మాంసం దొరకడం లేదు. అనారోగ్యంతో బాధ పడేవారు పత్యం కోసం ఔషధ విలువలు కలిగిన దుర్గం మేకపోతులు కొనుగోలు చేస్తుంటారు. ఉదయగిరిలో ఉండే వ్యాపారులు వీటిని కొనుగోలు చేసి బయట ప్రాంతం వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తుంటారు.10 కేజీల బరువు ఉండే ఉదయగిరి దుర్గంలోని మేకపోతు ధర రూ.18 వేల నుంచి 20 వేల వరకు పలుకుతోంది. అదే బయట ప్రాంతాలకు చెందిన మేకపోతు ధర రూ.12 వేలు వరకు కొనుగోలు చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు.



మేకపోతు

మెడిసిన్ విలువలు ఉంటాయి



సాధారణంగా మేక జీవిత కాలం 10 నుంచి 12 ఏళ్లు ఉంటుంది. మేక 8 నెలల వయస్సు నుంచి చూడి కడుతుంది. 5 నెలలకు ఈనుతుంది. ఏడాదికి రెండు సార్లు మేకలు ఈనతాయి. ఒక్కొక్క ఈతలో రెండు పిల్లలు పుడతాయి. ఒక్కోసారి అంతకన్నా ఎక్కువ కూడా పుడతాయి. 5 నెలల మేకపోతు నుంచి సుమారు 10 నుంచి 12 కేజీల మాంసం లభిస్తుంది. దుర్గం ప్రాంతంలో ఉండే మేకలు, మేకపోతులు ఔషధ మొక్కలు, ఆకులు మేతగా తీసుకోవడం వల్ల మంచి వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయి. వీటి మాంసంలో ఔషధ గుణాలు కలిగిన ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది.

– కొమ్మి కోటేశ్వరరావు, పశువైద్యులు

మాంసం చాలా రుచి



మా దుర్గంపల్లిలో చాలా మంది మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మా మేకలు, మేకపోతులు ప్రతి రోజూ దుర్గంలో ఉన్న ఔషధ మొక్కలు తింటాయి. వీటి మాంసం కూడా చాలా రుచిగా ఉంటుంది. అందుకే ఎక్కువ ధర చెల్లించి వ్యాపారులు మేకపోతులు తీసుకెళతారు. ఈ చుట్టుపక్కల వ్యాపారుల కంటే బయట జిల్లాల వ్యాపారులు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తుంటారు.

– బకీరు వెంకటయ్య,
దుర్గంపల్లి, ఉదయగిరి

మేకపోతులకు డిమాండ్ ఎక్కువ



దుర్గంపల్లి, ఉదయగిరి బీసీకాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీ చెందిన వారు మేకలను ఉదయగిరి దుర్గంలో మేపుతుంటారు. ఇక్కడ ఉన్న వివిధ రకాల ఔషధ మొక్కలు తిన్నందున మేకపోతుల మాంసం నాణ్యతగా ఉంటుంది. బయట జిల్లాల నుంచి వ్యాపారులు వచ్చి ఈ పోతులను అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తుంటారు. నేను కూడా ఇక్కడి పోతులను కొనుగోలు చేసి బయట విక్రయిస్తుంటాను.

– కె.తిరుపతయ్య,
వ్యాపారి, ఉదయగిరి బీసీ కాలనీ

స్థల వివాదంపై రెండో రోజూ ధర్నా

- సబ్‌కలెక్టర్ హామీతో ధర్నా విరమించిన జెడ్పీటీసీ
- స్థలం వద్ద 164 బీఎన్ఎస్ఎస్ ఆంక్షలు

లింగసముద్రం: వివాదంలో ఉన్న స్థలం విషయంలో కోర్టు ఆదేశాలను అధికారులు పాటించడం లేదని జెడ్పీటీసీ సభ్యురాలు, కుటుంబ సభ్యులు రెండో రోజు కూడా శనివారం ధర్నా కొనసాగించారు. మండలంలోని పెదపవనిలో స్థల వివాదం నెలకొన్న నేపథ్యంలో ఘర్షణ జరగడంతో అధికారులు తమకు సహకరించడంలేదని జెడ్పీటీసీ డాక్టర్ చెన్ను నళిని పద్మ, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ చెన్ను ప్రసాద్, కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ధర్నా కొనసాగించారు. వివాదాస్పద స్థలానికి కోర్టు స్టేటస్ కో ఇచ్చినా కొందరు ముస్లింలు శుక్రవారం స్థలానికి ఫెన్సింగ్ వేస్తున్నా.. అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. తమకు న్యాయం జరిగే వరకు ధర్నా కొనసాగిస్తామన్నారు. అయితే శనివారం ఉదయం తహసీల్దార్ సీతామహాలక్ష్మి ధర్నా నిర్వహిస్తున్న జెడ్పీటీసీ వద్దకు వచ్చి మీకు న్యాయం చేస్తామని చెప్పారు. వివాదాస్పదంగా ఉన్న స్థలం కోర్టులో ఉండగా తమ వారిపై దౌర్జన్యం చేసి ఫెన్సింగ్ ఎలా వేస్తారని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు ధర్నా కొనసాగడంతో కందుకూరు సబ్ కలెక్టర్ వివాదాస్పద స్థలంలోకి ఎవరూ వెళ్లకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అందులో ఎవరు ప్రవేశించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ ఫోన్ ద్వారా చెప్పడంతో జెడ్పీటీసీ ధర్నా విరమించారు.



వివాదాస్పద స్థలం వద్ద రెండో రోజూ ధర్నా నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నళిని పద్మ

స్థలం వద్ద 164 బీఎన్ఎస్ఎస్

వివాదాస్పద స్థలం వద్ద 164 బీఎన్ఎస్ఎస్ విధించామని, గ్రామ సర్వే నంబర్ 439/1లో ఉన్న స్థలం కోర్టులో ఉందని, ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నించినా అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. దీంతో స్థలం వద్ద 164 బీఎన్ఎస్ఎస్ విధించడంతో పోలీసులు పహారా కాస్తున్నారు.



స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ముళ్ల కంచె

ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(బారకాసు): ప్రజలందరి భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాకారమవుతాయని కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. శనివారం నగరంలోని వీఆర్సీ సెంటర్ నుంచి మద్రాసు బస్టాండ్ మీదుగా గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. జిల్లాలోని 722 గ్రామ పంచాయతీలతోపాటు అన్ని మున్సిపల్ కేంద్రాల్లో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛత దివస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెల మూడో శనివారం ప్రత్యేకంగా జరిగే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మున్సిపల్, పంచాయతీ పారిశుధ్య కార్మికులు ప్రతి రోజూ విధులు నిర్వహిస్తూనే ఉంటారని, అయితే సమాజంలోని అన్ని వర్గాలు మన ఇంటిని, మన ఊరిని, మన గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు శ్రీకారం చుట్టాలన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పరిశుభ్రతగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారని తెలిపారు. మన ఇంటి నుంచి పరిశుభ్రతను ప్రారంభిస్తే, మన పిల్లలే ముందుకు తీసుకెళ్తారన్నారు. మార్చి 31 నాటికి జిల్లాలో ఏ ఒక్క మారుమూల గ్రామంలో కూడా బహిరంగ బహి ర్భూమి లేకుండా చూడాలని, ఇది అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. మన ఒంటిని, ఇంటిని, ఊరిని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అన్నారు. ట్రంకురోడ్డు సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వివిధ వర్గాల ప్రజలందరితో కమిషనర్ సూర్యతేజ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, స్థానిక నాయకులు, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, మేయర్, మున్సిపల్ కమిషనర్

ఆక్రమిస్తాం.. దున్నేస్తాం

- రెవెన్యూ అధికారులకు సవాల్ విసురుతున్న భూఆక్రమణదారులు
- హెచ్చరిక బోర్డులు పెట్టినా వెనక్కి తగ్గని వైనం
- ఆన్‌లైన్‌లో పేర్లు మార్పించుకుని దురాగతం
- మర్రిపాడు మండలంలో ఇదీ పరిస్థితి

మర్రిపాడు: జిల్లాలో ప్రభుత్వ భూములు అధికంగా ఉన్న మర్రిపాడు మండలం మీదుగా మూడు జాతీయ రహదారులు ఉన్నాయి. దీంతో ఇక్కడి భూములకు బాగా గిరాకీ పెరిగింది. ఆక్రమణదారుల కళ్లు ఇక్కడి ప్రభుత్వ భూములపై పడ్డాయి. ఇంకేముంది కనిపించిన భూమిని కబ్జా చేస్తూ రెవెన్యూ అధికారులకు సవాల్ విసురుతున్నారు.

మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 21 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిలో 66 గ్రామాల్లో 1.20 లక్షల ఎకరాల భూమి ఉంది. ఇందులో ప్రభుత్వ భూములు, అనాధీనం 27 వేల ఎకరాల్లో... పోరంబోకు, మేత పోరంబోకు 10 వేల ఎకరాలు ఉన్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. మండలంలోని చిన్నమాచనూరు, ఈర్లపాడు, పెగళ్లపాడు, చుంచులూరు, పొంగూరుకండ్రిక, కంపసముద్రం, నాగినేనిగుంట, పడమటినాయడుపల్లి, మర్రిపాడు, పొంగూరు తదితర గ్రామాల్లో అత్యధికంగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ భూమి కనిపిస్తే రాత్రికి రాత్రే దానిని యంత్రాలతో చదును చేయడం, జామాయిల్ మొక్కలు నాటి తమ భూమి అంటూ చెప్పుకోవడం పరిపాటిగా మారింది.

ఫిర్యాదులు చేసినా ఫలితమేదీ?

ఆక్రమణలకు పాల్పతున్న వారిపై స్థానిక ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. తాత్కాలికంగా కొద్ది రోజులు ఆగి మళ్లీ ఆక్రమణదారులు యథావిధిగా తమ కబ్జా పర్వాన్ని కొనసాగిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో పేర్లను గతంలో వారే మార్చేశారు. ప్రస్తుతం వాటిని సాకుగా చూపి ఆ భూములు మావేనంటూ అధికారులపైనే ఒత్తిడి తీసుకొస్తున్నారు. అంతేకాక మండలంలోని చిన్నమాచనూరు పంచాయతీ నెర్దనంపాడులో కోర్టు పరిధిలో ఉన్న భూములను సైతం ఆక్రమణ చేసి పొగాకు నార్లు వేసేందుకు సిద్ధమయ్యారంటే వారు ఎంతగా తెగిస్తున్నారో అర్థమవుతోంది. చుంచులూరు గ్రామానికి చెందిన ఒక టీడీపీ నాయకుడు తన కుటుంబానికి సుమారు 100 ఎకరాలకు పైగా పొలం ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. ఇలా రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమణదారులు తమ ఇష్టారీతిన చదును చేస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకుంటున్నాం అంటున్నారే తప్ప అంతకుమించి ఏం చేయలేకపోతున్నారు. ఆక్రమణల పర్వం ఏ స్థాయికి వచ్చిందంటే మండలంలోని నాగినేనిగుంట పంచాయతీ బాట గ్రామంలో రెండు వర్గాలు ఘర్షణ పడి 10 మంది గాయపడేంత వరకు వచ్చింది. మండలంలో జరుగుతున్న భూ ఆక్రమణలపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు చొరవ చూపి ప్రభుత్వ భూములను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కంపసముద్రంలో ఆక్రమణకు గురైన భూమి (ఫైల్)



కదిరినేనిపల్లిలో ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు (ఫైల్)



ఇటీవల బాట సింగనపల్లిలో జరిగిన ఘర్షణలో గాయపడిన వ్యక్తులు (ఫైల్)

కఠిన చర్యలు తీసుకుంటాం

మండలంలో మా దృష్టికి వచ్చిన భూ ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆయా భూముల్లో ప్రభుత్వ భూములు అని తెలిపే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశాం. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమించినట్లు తెలిస్తే ప్రజలు మా దృష్టికి తీసుకురావాలి. వెంటనే వాటిపై చర్యలు తీసుకుంటాం.

– అనిల్, ఇన్‌చార్జి తహసీల్దారు,
మర్రిపాడు

బాలభవిత కేంద్రం ద్వారా ఆపరేషన్లు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి ఆవరణలో ఉన్న బాలభవిత కేంద్రం ద్వారా వివిధ రకాల లోపాలు ఉన్న పిల్లలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు డీఎంహెచ్ఓ వి.సుజాత తెలిపారు. శనివారం బాలభవిత కేంద్రంలో పుట్టుకతో గుండె సంబంధిత లోపాలున్న పలువురు చిన్నారులకు చెన్నై అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ప్రత్యేక వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే గ్రహణమొర్రి, గ్రహణ శూల, గుండె, నేత్ర, వినికిడి లోపం తదితర పలురకాల వ్యాధులతో పాటు సకాలంలో నడవలేని, మాటలు రాని పిల్లలకు ఇక్కడ స్పెషలిస్టు డాక్టర్ల ద్వారా ఉచిత వైద్య సేవలందించి వారి ఆరోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. అత్యంత ఖరీదైన కాక్లియర్ ఇంప్లాంట్ వంటి చికిత్స ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైస్ పీడియాట్రిషియన్ డాక్టర్ సురేష్‌బాబు, బాలభవిత కో–ఆర్డినేటర్ డాక్టర్ యశ్వంత్, సెంటర్ మేనేజర్ జమీర్, పీపీయూనిట్ ఎంఓ వెంకటేశ్వర్లు, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎన్ఆర్‌సీని డీఎంహెచ్ఓ సుజాత పరిశీలించారు.



బాలభవిత కేంద్రంలో చిన్నారులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ వి.సుజాత

క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేతలకు బహుమతుల ప్రదానం

సీతారామపురం: సంక్రాంతిని పురస్కరించుకొని స్థానిక ఆర్టీసీ బస్‌షెల్టర్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ శనివారంతో ముగిసింది. ప్రథమ బహుమతిగా రూ.10 వేలను సీతారామపురానికి చెందిన జాలీ ఫ్రెండ్స్.. ద్వితీయ బహుమతిగా రూ.ఐదు వేలను పబ్బులేటిపల్లి.. తృతీయ బహుమతిగా రూ.మూడు వేలను గంధంవారిపల్లి జట్లు దక్కించుకున్నాయి. వీరికి బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

రైల్వే డీఎస్పీగా మురళీధర్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రైల్వే డీఎస్పీగా మురళీధర్ నియమితులయ్యారు. పోలీస్ శాఖలో ఎస్సైగా 1991లో బాధ్యతలు చేపట్టిన మురళీధర్ రాయలసీమ జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో బదిలీల్లో నెల్లూరు రైల్వే డీఎస్పీగా నియమితులయ్యారు.

అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక



మాట్లాడుతున్న నాగరాజకుమారి

కొడవలూరు: వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే సమగ్ర ప్రణాళిక అవసరమని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి పేర్కొన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో 19 ఆదర్శ మండలాల ఏపీఎంలు, మండలంలోని 36 మంది యాక్టివ్ వీఓ సభ్యులకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఐదేళ్లలో ఎలాంటి చర్యలు పాటించడం ద్వారా వ్యక్తి, కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందో తెలియజేయడమే శిక్షణ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. శిక్షకులుగా నవీన్, ఖాజామస్తాన్ వ్యవహరించారు. డీపీఎం కామాక్షి, ఏపీఎం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్‌సేవ



రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి ఊంజల్‌సేవను శనివారం నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకార మండపానికి తీసుకొచ్చి అక్కడ తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నిర్వహించారు. నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వేడుకగా జరిపారు.

గొలుసు చోరీకి యత్నం

- నిందితురాలికి దేహశుద్ధి

నెల్లూరు(క్రైమ్): ఆటోలో సహచర ప్రయాణికురాలి మెడలోని గొలుసును చోరీ చేసి ఉడాయించేందుకు యత్నించిన నిందితురాలికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు.. నగరంలోని ఓ ఇన్సురెన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఆకుతోటకు చెందిన హేమలత విధులకెళ్లేందుకు గానూ ఆటో ఎక్కారు. అప్పటికే అందులో ఓ మహిళ ఉన్నారు. ఈ క్రమంలో నారాయణ ఇంజినీరింగ్ కళాశాల అండర్ పాస్ దాటి కొద్దిగా ముందుకొచ్చేసరికి అందులోని మహిళ తనకు వాంతొస్తోందని, ఆటోను ఆపాలని డ్రైవర్‌కు సూచించారు. దీంతో రోడ్డు పక్కగా ఆపుతుండగా, సదరు మహిళ ఒక్కసారిగా హేమలత మెడలోని గొలుసును తెంపుకొని ఉడాయించేందుకు యత్నించారు. తేరుకున్న బాధితురాలు ఆమె జట్టు పట్టుకొని పెద్దగా కేకలేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. నిందితురాలికి దేహశుద్ధి చేసి బాలాజీనగర్ పోలీసులకు అప్పగించారు. కోడూరుపాడు ప్రాంతానికి చెందిన పాత నేరస్తురాలిగా పోలీసులు గుర్తించారు. దీనిపై విచారణ జరుపుతున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి: రూ.39
సన్నవి: రూ.28
పండ్లు: రూ.18

పౌల్ట్రీ ధరలు



బ్రాయిలర్:	రూ.129
లేయర్	రూ.88
బ్రాయిలర్ చికెన్:	రూ.232
స్కిన్‌లెస్ చికెన్:	రూ.256
లేయర్ చికెన్:	రూ.150

పక్షుల పండగ ప్రారంభం



వైల్డ్ లైఫ్ శాఖ స్టాల్



ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



శ్రీసిటీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

- రాష్ట్ర మెగా ఫెస్టివల్‌గా మార్చినా పేలవంగా ఏర్పాట్లు
- పర్యాటకులను ఆకట్టుకోని ఎగ్జిబిషన్ స్టాల్స్

సూళ్లూరుపేట: ఫ్లెమింగో ఫెస్టివల్ తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా క్రీడా పోటీలను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. కబడ్డీ పోటీలను ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి కొద్దిసేపు ఆడారు.

ఏర్పాట్లపై పెదవి విరుపు

పక్షుల పండగను స్టేట్ మెగా ఫెస్టివల్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. దీని నిర్వహణకు సుమారు రూ.ఆరు కోట్లను మంజూరు చేసినా, ఆ తరహాలో ఏర్పాట్లు చేయలేదు. జిల్లాలోని అన్ని శాఖలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లు పర్యాటకులను ఆకట్టుకోలేకపోయాయి. శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు.

వీడియో ప్రదర్శనేదీ..?

అంతరిక్ష విజ్ఞానాన్ని తెలియజేసేందుకు స్టాల్‌ను షార్ కేంద్ర ఆధ్వర్యంలో నెలకొల్పారు. అయితే అంతరిక్షంపై పర్యాటకులకు వీడియో ప్రదర్శన లేకుండా చేశారు. వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లే క్రూ మాడ్యూల్‌ను ఉంచారు. ఈసారి కొత్తగా న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్‌ను ప్రదర్శించారు. పులికాట్ వన్యప్రాణి సంరక్షణ విభాగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ కొంతమేర ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాల ఊసే లేదు.

పక్షుల కేంద్ర సందర్శన

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రాన్ని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. కేంద్రంలో విడిది చేసే విహంగాలను వీక్షించారు. పర్యాటక ప్రాంతాలు, పక్షుల కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.



షార్ కేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్

శ్రీసిటీలో సదస్సు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా ఐదు కీలక వేదికలను ఏర్పాటు చేశారు. జీవ వైవిధ్యానికి కార్పొరేట్ సహకారం.. సుస్థిరత.. ఎకో టూరిజం అంశాల్లో వినూత్న ఆలోచనలు రేకెత్తించే సదస్సులకు వేదికగా శ్రీసిటీ నిలిచింది. శ్రీసిటీ ప్రగతిని ప్రతిబింబిస్తూ సూళ్లూరుపేటలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. అనంతరం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో కార్పొరేట్ సామాజిక బాధ్యత సదస్సును నిర్వహించారు. పులికాట్ సరస్సు, వలస పక్షుల నివాసాలను రక్షించేందుకు కార్పొరేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ బీఎన్‌హెచ్‌ఎస్ డైరెక్టర్ డాక్టర్ కిశోర్ రితే ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం తరఫున సీఎస్సార్ ద్వారా ఏటా రూ.కోటిని వెచ్చిస్తామని ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ప్రకటించారు. వివిధ పరిశ్రమల అధికారులకు జ్ఞాపికలను అందజేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సెల్వం, ముంబై నేచురల్ హిస్టరీ సొసైటీ డాక్టర్ సత్యసెల్వం, శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో జిల్లా వాసులకు పతకాలు



కొడవలూరు: చెన్నైలోని విట్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఆలిండియా యోగా మాస్టర్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన యోగా గురువులు ప్రతిభ చూపారు. 40 ఏళ్ల విభాగంలో కొడవలూరు మండలం గండవరానికి చెందిన యోగాగురు జ్యోతి రాజేంద్రకుమార్.. 60 ఏళ్ల విభాగంలో జిల్లాకు చెందిన బిల్లా రఘురామయ్య స్వర్ణ పతకాలు.. 50 ఏళ్ల విభాగంలో ప్రసన్నకుమార్ రజత పతకాన్ని సాధించారు. వీరికి పతకాలను యోగా కోఆర్డినేటర్ చిన్నికృష్ణ, నిర్వాహకుడు కార్తికేయన్, జ్యూరీ సభ్యులు గురుకిరణ్, రఘుపతి అందజేశారు.

అపురూపం.. నాటి మధుర జ్ఞాపకాలు



ప్రిన్సిపల్, అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

కందుకూరు రూరల్: పట్టణంలోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2007 – 09 మధ్య ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగూర్‌వలీ మాట్లాడారు. కళాశాలను గుర్తుపెట్టుకొని కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని అభినందించారు. కళాశాలలో మంచి వసతులున్నాయని, ఈ విషయాన్ని పదో తరగతి విద్యార్థులకు తెలియజేసి వారిని ఇక్కడ చేర్పించేలా కృషి చేయాలని కోరారు. అనంతరం కాలేజీ అభివృద్ధికి రూ.పది వేలను పూర్వ విద్యార్థులు అందజేశారు. విద్యార్థులను అధ్యాపకులు సత్కరించారు. కళాశాల పీడీ సుబ్బారావు, అధ్యాపకులు బాబూరావు, హజరత్తయ్య, కాశీరత్నం, అక్రమ్, మాధవరావు, పూర్వ విద్యార్థులు బాలాజీ, సుమాంజలి, గౌసియాబాను తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి





మహేంద్ర (ఫైల్) ఘటన స్థలంలో మృతదేహం

కందుకూరు రూరల్: బైక్ అదుపుతప్పడంతో యువకుడు మృతి చెందిన ఘటన కందుకూరు శివారులోని చుట్టుగుంట వెళ్లే రోడ్డులో జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సింగరాయకొండ మండలం శానంపూడికి చెందిన తగరం మహేంద్ర (29) పని నిమిత్తం కందుకూరు వచ్చారు. ఈ క్రమంలో తిరిగి ఇంటికి బయల్దేరారు. జాతీయ రహదారిపై వెళ్తూ బైక్ అదుపుతప్పడంతో కిందపడి తలకు బలమైన గాయమవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండలవిసేలా రోదించారు.

కారు ఢీకొని వ్యక్తి..

కారు ఢీకొనడంతో సైక్లిస్ట్ మృతి చెందిన ఘటన మండలంలోని మహదేవపురం రోడ్డులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని నాంచారమ్మకాలనీకి చెందిన నరసింహారావు మహదేవపురం రోడ్డు నుంచి కందుకూరుకు సైకిల్‌పై వస్తుండగా, సింగరాయకొండ వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కందుకూరులోని ఓ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఘటనలపై కందుకూరు రూరల్ ఎస్సై మహేంద్ర నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25 నుంచి అంతర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పో



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు సిటీ: అంతర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పోను తమ పాఠశాలలో ఈ నెల 25, 26న నిర్వహించనున్నామని సద్గురు సిల్వర్ ఓక్స్ సీబీఎస్‌ఈ స్కూల్ డైరెక్టర్ షణ్ముకాచారి, వెంకటాద్రినాయుడు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ముత్తుకూరు రోడ్డులోని పార్థసారథినగర్‌లో గల పాఠశాలలో శనివారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో వారు మాట్లాడారు. విజయవాడలోని శ్రీధర్ సీసీఈ సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. 30 దేశాలకు చెందిన వివిధ రకాల కరెన్సీ, పురాతన నాణేలు, ప్రపంచంలోని అతి పెద్ద, అతి చిన్న నోట్లతో పాటు స్టాంపులు తదితరాలను ప్రదర్శించనున్నామని చెప్పారు. ఆసక్తి గల పాఠశాలల యాజమాన్యాలు ముందుగా తమను సంప్రదిస్తే టైమ్ స్లాట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. దాదాపు 25 వేల మంది తిలకించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశామని, వివరాలకు 91827 28726, 98661 50354 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ప్రిన్సిపల్ సుధాకర్‌రావు, అడ్మిన్ ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం



తనిఖీల నిమిత్తం వచ్చిన అధికారులు

ఆత్మకూరు: గర్భస్థ శిశువుల ఆరోగ్య సంరక్షణ కోసం నిర్దేశించిన పరీక్షలను కొందరు దుర్వినియోగం చేస్తూ లింగ నిర్ధారణ చేసి ఆ విషయాలను వెల్లడించడం నేరమని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రితో పాటు పలు ప్రైవేట్ హాస్పిటళ్లలో తనిఖీలను శనివారం నిర్వహించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నిబంధనలను ఉల్లంఘిస్తే రూ.పది వేల జరిమానాను విధించడంతో పాటు చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వాస్పత్రిలోని స్కానింగ్ కేంద్రంతో పాటు ఐసీటీసీ, టీబీ యూనిట్లను పరిశీలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్‌ఎంఓ ఉషాసుందరి, డాక్టర్లు మేకపాటి దీప్తి, అరుణ, హారిక, శ్రావణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈఓ సుధాకర్ పాల్గొన్నారు.